కథానిక

# కారకులెవరు?

"సుబ్బన్న"

పంధొమ్మిది వందల నలభైఏడో సంవత్సరం జూలై ఒకటో తారీఖున పల్లె పట్టణం కాని ఊళ్ళో సుబ్రమణ్యానికి ఉద్యోగమైంది. మొన్న మొన్నటి సంగతే గనుక అతనికింకా కళ్ళకు కట్టినట్టుగానే ఉంది.

ఆ ఊరి మధ్యగా కలకత్తావరకు పరుగెత్తిన ట్రంకురోడ్డు, ఆ ఊరి నొరుసుకొంటూ పోయి బంగాళాఖాతంలో సుళ్లు తిరిగిన కొండవాగు సుబ్రమణ్యానికి పరమ మిత్రులు.

ఆ ఊరి పేరు చెబితే జామపళ్ళ వాసన కొడుతుంది; జొన్న చేల 'రొద' వినిపిస్తుంది; మిగుల ముగ్గిన మిరప పళ్లు కనిపిస్తాయి; 'కిలకిల' నవ్వుతూ 'టకటక' నడిచే ముమ్మరంగా ముస్తాబయిన పొగాకు పడుచులు జ్ఞాపక మొస్తారు.

ఆలాంటి ఊళ్ళో—

ఉన్నత పాఠశాల కెదురుగా అందమైన హాస్టలు ఉంది. దాని ముందు గుత్తులు గుత్తులుగా విరియ పూసే సీమ తంగేడు చెట్టూ, దాని ప్రక్కగా పొగడ చెట్టూ, ఆ రెంటికీ ముందు రెండువరుసల్లో కొబ్బరి మొక్కలూ ఉన్నాయి.

ఎండా కాలంలో,

పొగడ చెట్టుక్రింద కూర్చుని ఆకులగుండా ఎర్రని తంగేడు పూగుత్తుల కేసి చూసే సుబ్రమణ్యం అపుడపుడు మైమరచేవాడు. వేడి గాలి అతనిమీద పొగడ పూలు రాల్చేది. రాలిపోయిన పొగడ పూలు ఎండి వరుగులైనా ఘుమఘుమ లాడేవి. అప్పుడప్పుడు హాస్టలు విద్యార్థులు కుండలోని మంచినీరు గాజు గ్లాసుతో ఇచ్చేవారు. సుబ్రమణ్యం ఆ చల్లని నీటిని అమృతప్రాయంగా చప్పరించేవాడు, ఆనందించేవాడు, తృప్తిగా గాలి పీల్చేవాడు.

ఆ రోజున,

సుబ్రమణ్యం, శంకరం (ఒక విద్యార్థి) కలిసి వడగొట్టి పడిపోయిన గోరువంకకు నీరు పెడుతున్నారు. అనుకోకుండా వారికి ప్రధానోపాధ్యాయులవారి దర్శనమైంది. ఊరకరారు మహాత్ములని సుబ్రమణ్యానికి బాగా తెలుసు. నీరు త్రాగి తెప్పరిల్లిన మైనా రెక్కలు రెపరెపలాడించింది. పచ్చని కాళ్ళు, నల్లని కళ్ళు చూస్తూ శంకరం పేరంటానికి వెళ్ళివచ్చిన ముప్ఫయ్యో పడిలోవున్న బ్రాహ్మణ ముత్తయిదువును జ్ఞాపకం చేసుకొంటున్నాడు. శ్రీవారు శంకరంవైపు ఉరిమి చూశారు. తల వంచుకొని వాడు హాస్టలు లోపలికి వెళ్ళాడు. తుర్రుమని గోరువంక పొగడ చెట్టెక్కింది.

అప్పుడు,

"ఏమండీ?" అన్నారు ప్రధానోపాధ్యాయులు.

"చెప్పండి" అన్నాడు సుబ్రమణ్యం గోరువంకను చూస్తూ.

"చూశారూ!" అంటూ శ్రీవారు సుబ్రమణ్యం భుజం తాకారు.

చైతన్యం కల్గించడమే వారి ఉద్దేశ్యం కావచ్చు, అపార ప్రేమ వాహినిని ప్రవహింపచేసే పద్ధతైతే కావచ్చు; సుబ్రమణ్యానికి మాత్రం ఆస్పర్శ గొంగళిపురుగులు పాకినట్లుగా తొండలు పరిగెత్తినట్లుగా, మండ్రగబ్బలు బరికినట్లుగా ఉంది.

శ్రీవారు మొదలుపెట్టారు:

"పచ్చని చెట్టుక్రింద నిలబడి చెబుతున్నాను"

"పచ్చని చెట్టు"— ఈ మాట వినగానే సుబ్రమణ్యానికి పోయినప్రాణం లేచివచ్చింది. అతని కళ్ళ ముందుగా పచ్చని తంగేడు చెట్టు, ఎర్రని పూగుత్తులు, కోమలమైన రెమ్మల మధ్యగా ఒరిగి ఎండవేడికి వణుకుతున్న రంగు రంగుల పొన్నంగి పిట్టలు, ఝల్లునరాలే పొగడపూలు గిర్రున తిరిగాయి.

అంత సుందరమైన దృశ్యాన్ని శ్రీవారి

ధోరణి కార్చిచ్చులాగ తగలేసింది. మంగళప్రదమైన పచ్చని చెట్టును మారణహోమానికి దారి తీసే ఒట్టు పెట్టుకోడానికి నిర్మొగమాటంగా ఉపయోగించుకొన్నారు ఆ గోదావరి పెద్ద మనిషి.

హెడ్మాష్టరంతటివారు ఎండవేళ బయటకి రావడం, అందులో అనుభవంలేని అసిస్టెంటును చూడటం, సంభాషణ ఒట్టు పెట్టుకోవడంతో ప్రారంభం కావడం సుబ్రమణ్యానికి సహించరాని విషయాలుగా తోచాయి. అంత అవసరమేవస్తే అతన్నే శ్రీవారి ఇంటికి పిలిపించుకోవచ్చునుగా?

సుబ్రమణ్యం విసురుగా ఆయన ముఖంలోకి చూశాడు. తంగేడు చెట్టు నిలువునా తగలడుతోంది. పొన్నంగి పిట్టలు మాడి కమురుకంపు కొడుతున్నాయి. శ్రీవారు చెప్పుకుపోతున్నారు:

"మిమ్మల్ని నాసోదరునిగా చూసుకొంటున్నాను. నిన్న సెక్రెటరీగారితో కూడా ఈ విషయమే చెప్పాను..."

సుబ్రమణ్యానికి వెన్నుమీద బాకుతో పొడిచినట్లుగా ఉంది. బరువు గుండెతో భయంగా అడిగాడు: "అసలు విషయమేమిటి?"

"ఆ, చెబుతున్నా, మరేంలేదూ, మీరు లెఖల పేపరు ఇంకా ఇవ్వలేదు."

"క్షమించండి. నిన్న వ్రాశాను. రేపు ఇవ్వవచ్చును గదా అని..."

"నాకు తెలీదటండీ! ఒకపూట ముందుగా తీసుకోవడం ఎందుకైనా మంచిదని ఇలాగ వచ్చేశాను."

సుబ్రమణ్యం చరచర లోపలికినడిచి ప్రశ్నపత్రంతో తిరిగి వచ్చాడు. ఇద్దరూ కలిసి రోడ్డుదాకా నడిచారు.

అక్కడ——

"ఇంక మీరుండండీ!" అంటూ శ్రీవారు సుబ్రమణ్యం చేతిలోని కాగితాలందుకొన్నారు. వాటిని కోటుజేబులోనికి నెడుతూ "ఈజీగా నే ఇచ్చారుగా?" అన్నారు.

"ఓ మాటు చూడండీ. మార్పులు అవసరమైతే చేస్తాను."

"ఎందుకండీ. మీరివ్వడమూ అందులో మళ్ళీ మార్పులుండటమూనా? నలుగురూ నడిచే దారిలో నిలబడి చెబుతున్నాను - మీరంటే నాకున్న నమ్మకం మరొకరంటే లేదు."

సుబ్రమణ్యం నడుంకలుక్కుమన్నది. రెండు చేతులూ ఎత్తి కొంచెంగా వంగి నమస్కరించాడు. శ్రీవారు చిరునవ్వుతో, మండుటెండలో చెమర్చుకొంటూ నలుగురు నడిచే దారిప్రక్కగా ముందుకు నడిచారు.

* * *

పిల్లలంతా జట్లుజట్లుగా కృషి చేస్తున్నారు. కొన్ని జట్లు తెల్లవార్లూ మేలుకొంటున్నాయి. వారి పని పరిపరివిధాలుగా ఉంది. 'టీ' త్రాగటం, నిద్ర రాకుండా ఉండటానికని అర్ధరాత్రివేళ నాలుగు బజార్లూ తిరగడం, ఈ పేపరు వాడిచ్చాడు, ఆ పేపరు వీడిచ్చాడని తర్కించడం, ప్రయివేటు మాస్టర్ల దగ్గర సంపాదించిన కిటుకులుకీలకాలూ ఉపయోగించి పరీక్షకొచ్చేవి ఊహించడం, అక్కడ అవును కాదని కాసేపు దెబ్బలాడటం, ఆ ప్రశ్న తప్పకుండా వస్తుందనడానికి వాడికి హెడ్మాష్టరుగారి అబ్బాయిద్వారా లభించిన పరమ రహస్యాన్ని ప్రక్కవాడి చెవిలో ఊదటం, కొన్ని విషయాలు చిన్న చిన్న కాగితాల మీద వ్రాయడం, కొన్ని పుస్తకాలలోని కాగితాలను చించి జాగ్రత్త చేయడం, పరీక్ష హాల్లో తన సీటుయొక్క ఉనికికి తగ్గినట్లు తానాచరింపబోయే కార్యక్రమాన్ని తయారుచేసుకొనడం- ఇదీ వారి పని.

రాత్రి పదిగంటల లోపల హాస్టలు చుట్టూ ఒకటి రెండు పర్యాయాలు తిరగటం, కొన్ని జట్లదగ్గర కొంచెంసేపు కూర్చోవడం, రెండు మూడు విషయాలు వాళ్ళకు చెప్పడం, ఈ లోగా నిద్రపోయే పిల్లలను లేపి వాళ్ల మొఖాన కాసిని చన్నీళ్ళు కొట్టడం, అక్కడక్కడ అల్లరి చేయవద్దని హెచ్చరించడం, పది గంటల తరువాత అందరినీ పడుకోమని సలహా ఇవ్వడం- ఇదీ సుబ్రమణ్యం పని.

తెల్లవారితే లెక్కల పరీక్ష.

లెక్కలు చదివేదేమిటని కొందరు పడుకొన్నారు. డాబామీది కెక్కిన జట్టు వెన్నెల్లో కూర్చుని సినిమా కబుర్లు చెప్పుకొంటోంది. వారికవతలగా కొంతమంది బుద్ధిమంతులు వాళ్ల

ప్రయివేటు పంతులు 'ముఖ్యం' అని గుర్తుపెట్టిన లెక్కలవంక చూస్తున్నారు. నలుగురైదుగురు పిల్లలు మాత్రం పాతపేపర్లు తెచ్చి 'వర్కు' చేస్తున్నారు.

ఇక్కడిలా ఉండగా,

పాఠశాల భవనంలో, పడమటివైపు వసారా క్రింద చిన్నదీపం కనిపించింది. దీపంచుట్టూ కూర్చున్న లేతముఖాలు తీవ్రంగా పని చేస్తు న్నాయి. వాటివెనుక నిలబడిన ముదురు మొఖాలు సీరియస్‌గా చూస్తున్నాయి. వారికి కొంచెం ప్రక్కగా స్కూలు గంట క్రిందుగా వెలుగునీడల మధ్యన రొమ్ము విరుచుకు నిలబడ్డ ఘోర్రుఘారం వెంకటేశ్వర్లు సిగరెట్ పొగ పీలుస్తూ,

"ఇంకా ఎంతసేపురా?" అని దబా యిస్తున్నాడు.

సుబ్రమణ్యం వాళ్ళదగ్గరకు చేరాడు.

"ఎనిమిదోలెక్క చెప్పరా?" శంకరం అడి గాడు. మూర్తి చెప్పలేదు. శంకరం లేచి మూర్తిదగ్గరకు వస్తూ ప్రక్క నున్న సుబ్ర మణ్యాన్ని చూశాడు.

"మేష్టార్రోయ్!" పొలికేక పెట్టేడు.

గుంపు గప్పున లేచి ఎక్కడి కాగితాలు అక్కడ మాయం చేస్తోంది. వెంకటేశ్వర్లు సిగరెట్ ముక్క విసిరేసి ముందుకొచ్చాడు.

"ఇంత పొద్దుపోయినా ఏం పడిపోయిం దని వచ్చారండీ!" వెటకారంగా అడిగాడు.

"మీకు తెలియని లెక్కలు చెబుదామని."

"సంవత్సరం పొడుగునా చెబుతూనే ఉన్నారుగా. ఇప్పుడూ చెప్పాలీ?...మా తిప్ప లేదో మేం పడుతున్నాం, మీరుపోయి పడు కోండి."

"మీరు తిప్పలుపడట మెందుకు నేను సులువుగా చెబుతానంటే?"

"మాకన్నీ తెలిశాయి. మీరేమీ చెప్ప నక్కర్లేదు."

"ఎక్కడ తెలిశాయిరా? ఇందాకటినుంచీ కొట్టుకొన్నా ఎనిమిదో లెక్క రాకనేపోతే!" అమాయికంగా అనేశాడు మూర్తి.

"షటప్, ఫూల్" గదిమాడు వెంకటేశ్వర్లు. మూర్తి ముఖం ముడుచుకుపోయింది. మాటల సందున మెల్లిగా తప్పించుకుపోయిన సుందరం చింతచెట్టు ప్రక్కన నక్కాడు. సుందర్భాన్ని అర్థంచేసుకొన్న సుబ్రమణ్యం చిరునవ్వు నవ్వి తిరుగుముఖం పెట్టాడు. అదను చూచుకొని గుంపంతా స్కూలువెనక్కి వెళ్ళింది. గేటు దాకా వెళ్ళిన సుబ్రమణ్యం మలుపు తిరిగి చింతప్రక్కని సుందరాన్ని చెవిపట్టుకొని హాస్టల్లోకి ఈడ్చుక పోయినాడు.

గాభరాపడి చెమర్చిన సుందరాన్ని బుజ్జ గించి వాడు దాచుకొన్న కాగితాలను బయటకు లాగాడు సుబ్రమణ్యం. తాను ఇచ్చిన లెక్కల పేపరులోని మొదటి పది లెక్కలు వరుస తప్పకుండా ఉన్నవి ఉన్నట్లుగా బయట పడ్డాయి. సుబ్రమణ్యం నిలువునా నీరై, కొస్త తెప్పరిల్లి సుందరాన్ని కూర్చోబెట్టి వాడికిరాని ఎనిమిదో లెక్కను చెప్పేశాడు. దాంతో సుందరం గుండె కుదుటపడ్డది.

"ఇదేమిటోయ్ ఇంత పిచ్చిలెక్కలు పరమ రహస్యంగా చేస్తున్నారు?"

సుందరంవెనకాముందాడుతున్నాడు. సుబ్ర మణ్యం వాడిని అనునయించే సరికి చెప్పేశాడు:

"పిచ్చివి కాదండీ, ఇంపార్టెంటని హెడ్మా స్టారు ప్రయివేట్లో చెప్పారట. వాటినేమో వెంకటేశ్వర్లు సంపాదించుకొచ్చాడు."

సుబ్రమణ్యం బరువుగా ఊపిరి పీల్చాడు.

ఆ మరునాడు,

పరీక్షహాల్లో సుబ్రమణ్యం నిబ్బరంగా ఉండ లేకపోయినాడు. పొడిదగ్గు దగ్గి లోపలికొచ్చిన ప్రధానోపాధ్యాయుల వారితో,

మీదగ్గర ప్రయివేటుచదివే పిల్లలు లెక్కలు హుషారుగా చేస్తున్నారే" అన్నాడు.

"అలాగా అండి. వాళ్లు కొస్త తెలివైన వాళ్లే లెండి."

"తెలివేమిటండీ, క్లాసులో ఒకడూ పెదవి మెదిపిన పాపాన పోలేదు."

"అలాగా అండీ! మీరు లెక్కలు తేల్గా ఇచ్చానన్నారు కదూ. ఏదీ ఓ పేప రిలా ఇవ్వండి."

"మీరు చూడనే లేదా?"

"పదిమంది కట్టిన ఇంటిక్రింద నిలబడి చెబుతున్నాను. మీరు చేసిన పనికి వంకా

వరుకూ ఉంటుందనే సందేహం నాకు లేనే లేదు. అందుకే మీ పేపరు చూడకుండానే ప్రెస్‌కు పంపేశాను."

సుబ్రమణ్యానికి పదిమందీ కట్టిన ఆ ఇల్లు విరిగి నెత్తిన పడ్డట్లుగా ఉంది. శ్రీవారి ముఖం లోకి ఒక్కమాటు చూశాడు. అది మాడిన మంగలం పెంకులాగ ఉంది. వారు రెండో ద్వారంగుండా మరో హాల్లోకి వెళ్ళిపోయినారు.

"నేను ప్రయివేట్లు చెప్పుకొంటున్నానని ప్రతివాడికీ కడుపుమంట. చూడండీ, నరసయ్యగారూ, బాధ్యతగల నేను ప్రశ్న పత్రాలను పిల్లల కిస్తానటండీ?" ఈ మాటలు విన్నాడు ఆన్సరు పేపర్లు ఒప్పగించడానికి హెడ్మాస్టరు గదిలోనికి వెళ్ళిన సుబ్రమణ్యం.

"బాధ్యతగల వ్యక్తి ఎవరూ ఆ పనిచేయడు. కాని డబ్బుకోసం గడ్డికరిచేవారు ఎంత ఉన్నత స్థానంలో ఉంటే అంత ప్రమాదం తప్పదు" అనేశాడు ఆవేశంతో సుబ్రమణ్యం.

లౌకిక ప్రజ్ఞలో అందెవేసిన ప్రజ్ఞానిధి గనుక హెడ్మాస్టరు తొందరపడలేదు. తన సీటునుంచి లేచి సుబ్రమణ్యాన్ని ప్రక్కకు పిలిచారు. అతని చేతిలోని కాగితాలనందుకొంటూ,

"గాయత్రీ సాక్షిగా చెబుతున్నాను. మీరీ విషయంలో ఏమీ సందేహించ నక్కరలేదు" అన్నారు.

సుబ్బన్నకు ముచ్చెమటలు పోశాయి. అగ్ని సాక్షిగా పెళ్ళి చేసుకోవడం అతడెరుగును. దేవుడి సాక్షిగా కోర్టులో అబద్ధాలాడటం అతడు విన్నాడు. అర్థం తెలియకపోయినా ఆచారానికి తలొగ్గి వేసుకొన్న గాయత్రికి ఉంగరాలు తాళపు చెవులు కట్టడం అతడు చూశాడు. భావి భారత పౌరులను సంస్కరించే పాఠశాలలాంటి సంస్థకు అధికారులై ఇతరులకు ఆదర్శప్రాయులు కావలసినవారు గాయత్రిని ఇలా ఉపయోగించుకోవటం ఇంకా అతని అనుభవంలోకి రాని విషయం.

ధనికుల బిడ్డలు ప్యాసయేవిధానం విన్నాడు. ప్రయివేటు పంతుళ్ళు పిల్లలను పాఠశాలలో ప్రవేశపెట్టే ఏర్పాట్లు అర్థం చేసుకొన్నాడు. సరస్వతీ నిలయాలను కనుమసక చీకట్లో లక్ష్మి కూడే స్థావరాలుగా మార్చే వ్యక్తుల ఆధ్వర్యం క్రింద పనిచేయడం దుర్భరమని తెలుసుకొన్నాడు. పావుతావు కాగితం శ్రీవారికందించి సెలవు పుచ్చుకొన్నాడు. శ్రీవారు మొసలి కన్నీరు కార్చారు. కొంతమంది విద్యార్థులు శని విరగడైపోయిందన్నారు. పొగడ చెట్టు మాత్రం వెలవెలపోయింది. తంగేడు చెట్టు ఎర్రని పూరెక్కలన్నీ రాల్చేసింది. సుబ్రమణ్యం చల్లని వాగు నీటిలో చేతులు కడుక్కొని బరువు హృదయంతో పాఠశాలకు నమస్కరించి బస్సు ఎక్కాడు.

* * *

మేనెల చివరిరోజుల్లో, సుబ్రమణ్యం, పేపరులోని రెండు పంక్తులు మూడు పర్యాయాలు చదువుకొన్నాడు. అతనికి అర్థం కాలేదు. "ఫలానా పాఠశాల ఫలితాలు తరువాత ప్రకటించబడును" అని ఉంది. బాధ్యతగల వ్యక్తి చేసిన అక్రమ వ్యవహారానికి నిరపరాధులైనకొంతమంది బాలకులు ఆహుతియినారు.

సైన్సు పరీక్షలో హోల్‌సేల్ కాపీ జరిగినందున వారిని రెండు సంవత్సరాలు డీబార్ చేశారని తదుపరి వార్త. అక్రమంగా ప్రవర్తించిందెవరో అధికారులకు తెలియదు. సర్వశక్తురాలైన గాయత్రి వారికి రక్షగానిలుస్తుంది. ఏపాప మెరుగని కొన్ని పసి హృదయాలు కుమిలి పోయినాయి.

అయితేనేం——

నేటికీ ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుల వారు శ్రీవారే. మార్గమేదైనాసరే కార్యం సాధించగలవాడే సమర్థుడనీ, బెడిసికొడితే ఖర్మమనీ, దురదృష్టమనీ గట్టిగా నమ్మే పాలకులు తమకు తియ్యని మాటలు చెప్ప నేర్పిన వ్యవహర్తలను సమర్థించడంలో వింతేముంది?

ఆంధ్రదేశపు పాఠశాలల్లో "స్టాండర్డు"తగ్గిపోవడానికి, అక్కడిరాజకీయాలూ, విద్యార్థుల అవినీతీ కారణమంటారు గాని, డబ్బు తీసుకొని పైక్లాసులో అడ్మిషన్ ఇచ్చే గాయత్రీసాక్షులు, పరీక్షలవగానే సంచులు పట్టుకొని మార్కుల వేటకు బయలుదేరే బురఖా పెద్దలూ, ఊసురోమని బల్లమీద కాళ్ళు పెట్టుకు కునికిపాట్లుపడే ఉపాధ్యాయులూ ప్రబల కారణాలని అందరికీ తెలిసినా ఎవరూ ఒప్పుకోరు.